క్లుప్తంగా

కార్మికుల కృషి ఎనలేనిది



నరసరావుపేట: పట్టణాన్ని అందంగా ఉంచటంలో పారిశుద్ధ్య కార్మికుల కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ నమస్తే పథకం (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ సిస్టం) కింద డ్రైలెట్రీన్లు, సెప్టిక్ ట్యాంకు, సీవర్‌లైన్ శుభ్రపర్చే కార్మికులకు అవసరమైన పీపీఇ కిట్లు డ్రెస్, బూట్లు, టోపీలు సామగ్రిని అందజేశారు. పారిశుద్ధ్య పనులు చేస్తున్నందుకు వారిని అభినందించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.జస్వంతరావు శానిటేషన్ అధికారులు జి.రామకోటయ్య, పి.రమాదేవి, పర్యావరణ కార్యదర్శులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు వేల్పూరు విద్యార్థులు



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల ఇరువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 26న చిలుకలూరిపేట మండలం పసుమర్రులో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ జిల్లా పోటీల్లో జరగ్గా అండర్–14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి బొల్లా షణ్ముఖ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. అలాగే రగ్బీ క్రీడా పోటీల్లో ఈనెల 30న నూతక్కిలో జరిగిన పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు నుంచి మర్రి వెంకట శ్రీవల్లి (8వతరగతి) విద్యార్థి ఎంపికైనట్లు తెలిపారు.
ఇరువురు విద్యార్థులను సర్పంచ్ బీర్పేడి రత్నగిరి, జెడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, ఎంపీటీసీ లింగా శ్రీను, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కాకుమాను రాజేష్, ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లాలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సహకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. నూతనంగా డీఈఓగా బాధ్యతలు చేపట్టిన చంద్రకళను బుధవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని కోరారు. ఈసందర్భంగా డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తనవంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. అలాగే ఉపాధ్యాయులు పాఠశాలల నిర్వహణ, నాణ్యమైన విద్యా బోధన, విద్యార్థుల హాజరు శాతం తదితర అంశాల పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. డీఈఓ చంద్రకళను కలసిన వారిలో సంఘం జాతీయ ఆర్థిక కార్యదర్శి సి.హెచ్.జోసఫ్ సుధీర్ బాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.వి.రామిరెడ్డి, యు.చంద్రజిత్ యాదవ్, రాష్ట్ర నాయకులు ఎస్.ఎం.సుభానీ, వెంకట కోటయ్య, ఎ.ఏమండీ, భీష్మారావు ఉన్నారు.

కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

వినుకొండ(నూజెండ్ల): స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీల శక్తిసామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, ఇతర వసతి సౌకర్యాలను పరిశీలించారు. రానున్న పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులున్నా వెంటనే సమాచారం ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.

దీపాల పండుగ.. బాణసంచా మెండుగ...






"ఇయ్యాల అచ్చమైన దీపావళి / వెయ్యేళ్ల నిత్యమైన దీపావళి / ఏనాడు వెళ్లిపోని దీపావళి / ఏరికోరి ఎంచుకుంది మా లోగిలి " అని ఓ సినిమాలో పాట. అలాంటి వెలుగు దివ్వెల పండుగ దీపావళి పర్వదినానికి నరసరావుపేట సిద్ధమైంది. పండుగ సంబరాలకు అత్యావశ్యకమైన టపాసుల దుకాణాలకు సత్తెనపల్లి రోడ్డులోని స్టేడియం వేదికగా నిలిచింది. ప్రభుత్వ సూచనలు, ఆదేశాల మేరకు వ్యాపారులు వీటిని ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం చిన్నపిల్లలు తమ పెద్దల చేయి పట్టుకుని ప్రాంగణానికి వచ్చి బాణసంచా కొనుగోలు చేసుకుని వెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. గురువారం ఉదయానికి వీటి అమ్మకాలు విస్తృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. – నరసరావుపేట

‘ప్రణాళిక’గా డబ్బులు అడుగుతున్నారు


చైర్మన్ షేక్ రఫాని



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు

- మునిసిపల్ సమావేశంలో కౌన్సిలర్ ఆవేదన
- పట్టణ టౌన్ ప్లానింగ్ నిద్రపోతోంది

చిలకలూరిపేట: పట్టణ ప్రణాళిక విభాగంలో ప్లాన్ల అప్రూవల్ కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి అంటూ 37వ వార్డు కౌన్సిలర్ పి.శివకుమారి నిలదీశారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. సమావేశంలో కౌన్సిలర్ శివకుమారి మాట్లాడుతూ ప్లాన్లు మంజూరు చేసేందుకు డబ్బులు అడగడంతో పాటు కొత్తగా ఇళ్లు నిర్మించేవారు డ్రైన్లను ఆక్రమించి మెట్లు కడుతున్నారు, అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు అంటూ ఆరోపణలు చేశారు. దీనికి మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు సమాధానం చెబుతూ ఈ మధ్య కాలంలో ఆన్‌లైన్ సమస్యలతో ఒక్క ప్లాను అప్రూవల్ చేయలేదని వెల్లడించారు. ఎక్కడైనా అవినీతి జరిగినట్లు తెలిస్తే తనకు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇంటి ముందు కాల్వలపై మెట్లు కట్టకుండా టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారు. 10వ వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ పట్టణంలో అక్రమ కుళాయి కనెక్షన్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. వాటిని క్రమబద్ధీకరిస్తే పురపాలక సంఘానికి ఆదాయం వస్తుందని చెప్పినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ విషయమై మున్సిపల్ డీఈఈ షేక్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ అక్రమ కుళాయి కనెక్షన్ల జాబితా రూపొందిస్తున్నామని, త్వరలోనే తగు చర్యలు చేపడతామని సమాధానం చెప్పారు. కమిషనర్ శ్రీహరిబాబు, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, డీఈఈ అబ్దుల్ రహీం తదితరులు మాట్లాడారు.

వాడివేడిగా మున్సిపల్ సమావేశం

వినుకొండ(నూజెండ్ల): మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ దస్తగిరి అధ్యక్షతన బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు అజెండాలోని అంశాలపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. 9వ వార్డు కౌన్సిలర్ రెడ్డి నాగపద్మ వ్యాపార సంస్థ లైసెన్సులు ఆన్‌లైన్ చేసి ధరలు పెంచడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇబ్బంది పడుతున్నారని ఆన్‌లైన్ ఫీజుల పేరుతో అధికంగా వసూలు చేయడం వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. దీంతో అజెండాలోని మొదటి అంశాన్ని పక్కన పెట్టారు. అలాగే పట్టణంలోని ఆక్రమణలు తొలగించే విషయంలో ఏకంగా మున్సిపల్ చైర్మన్ దస్తగిరి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆక్రమణలు తొలగించడం ముఖ్యం కాదని, మళ్లీ అదే స్థలంలో యధావిధిగా ఆక్రమణలు జరుగుతున్నాయని, మీరు పూర్తిగా ఆక్రమణలు జరగకుండా చర్యలు చర్యలు చేపడితేనే ఈ అంశాన్ని పరిశీలించాలని, ఆ విషయం ఆ అంశాన్ని కూడా పక్కన పెట్టారు. తదుపరి అజెండాలోని అంశాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించారు.


మాట్లాడుతున్న చైర్మన్ దస్తగిరి

కౌన్సిల్ సభ్యుల అసంతృప్తి

మున్సిపల్ సమావేశాల్లో అజెండాల అంశాలను ఆమోదించడం తప్ప అమలు కావడం లేదని, అలాంటప్పుడు సమావేశాలు ఎందుకు నిర్వహించాలని అధికారులను కౌన్సిల్ సభ్యులు నిలదీశారు. టీడీపీ, వైసీపీ సభ్యులు కూడా అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏమైనా అజెండాల అంశాలు అమలు చేసినప్పుడు కచ్చితంగా లేనిపక్షంలో ఇలాంటి సమావేశాలు అనవసరమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఇరువురు క్రీడాకారుల ఎంపిక

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు క్రీడాకారులు అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు బిఎం. సుభాని బుధవారం తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలోని రావెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఇరువురు ఎంపికయ్యారు.
బాలుర విభాగంలో బి.బాలకృష్ణ ఎంపికవ్వగా, బాలికల విభాగంలో కె. చిత్రదీపిక ఎంపికయ్యారన్నారు. నవంబర్ 25వ తేదీన అనంతపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టులో పాల్గొని ఆడతారన్నారు. ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు వై.సైదయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇట్టే ఏడుకొండలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.


బి. బాలకృష్ణ


కె. చిత్రదీపిక

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు వాగ్దేవి విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాస రావు, ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈనెల 28వ తేదీన నకరికల్లు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఖో ఖో అండర్–17 ఎంపిక పోటీలలో బాలుర విభాగంలో పొట్లూరి నవీన్, బాలికల విభాగంలో ఆవుల భూమిక ఉమ్మడి గుంటూరుజిల్లా జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. నవంబరు 2 నుంచి అనకాపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో ఉమ్మడి గుంటూరుజిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.



సమస్యల పరిష్కారానికి చర్యలు

వినుకొండ(నూజెండ్ల): డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకంలో వైద్యమిత్రల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం స్పందించడంపై స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును వైద్యమిత్రలు కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును శాలువా, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి, కార్యదర్శి కాకాని అప్పారావు, జిల్లా జనరల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, హనుమంతరావు పాల్గొన్నారు.

సంసిద్ పాఠశాల విద్యార్థికి బంగారు పతకాలు



శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామ పరిధిలో ఉన్నటువంటి సంసిద్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అథ్లెటిక్స్ పరుగుపందెం పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఒంటేరు నాగ సురేష్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 29న గుంటూరు జిల్లా సిరిపురంలో జరిగిన ఎస్.జి.ఎఫ్.ఐ 600 మీటర్ల 400 మీటర్ల పరుగుపందెం పోటీల్లో ప్రథమస్థానం సాధించినట్లు తెలిపారు. నవంబరు 4న పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో అండర్–14 విభాగంలో ఎంపికై నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇదే విధంగా ప్రతిభ కనపరిచి మరిన్ని పతకాలు సాధించి పాఠశాలకు తమ తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థి నాసరయ్యను వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

వినుకొండ(నూజెండ్ల): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వినుకొండ డిపో నుండి పంచారామాలకు ప్రత్యేక అల్ట్రా డీలక్స్ బస్సులను నవంబరు 3, 10,17,24 తేదీల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. ప్రయాణీకులు ఒక్కొక్కరికీ చార్జీ రూ.1400లు ఉంటుందని, ఆదివారం రాత్రి 10 గంటలకు బస్సు స్థానిక డిపో నుంచి బయలుదేరి సోమవారం రోజు పంచారామాలను భక్తులకు దర్శనం చేయించి మంగళవారం ఉదయం తిరిగి వినుకొండకు వస్తుందన్నారు. మహానంది, అహోబిలం, యాగంటి, ఒంటిమిట్ట, బ్రహ్మంగారి మఠం, సిద్దేశ్వర మఠానికి కూడా బస్సును ఏర్పాటు చేశామన్నారు. రూ.1600 చార్జీతో కార్తిక పౌర్ణమి రోజు అరుణాచలానికి సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. వివరాలకు 9959225431, 7382888783 నంబర్లను సంప్రదించాలన్నారు.

నిబంధనల ప్రకారం వ్యాపారాలు చేయాలి

ఈపూరు: స్థానిక ఈపూరు వ్యవసాయ కార్యాలయంలో మండలంలో ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్స్‌తో మండల వ్యవసాయాధికారి రామినేడి రామారావు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ డీలర్లు అందరూ చట్ట ప్రకారం వ్యాపారం చేయాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువగా ధరలకు విక్రయించకూడదన్నారు. రైతులకు కచ్చితంగా బిల్ ఇవ్వాలని, బిల్‌పై రైతు మొబైల్ నంబరు వేయాలని సూచించారు. ఎరువులు అమ్మేటప్పుడు రైతు బయోమెట్రిక్ వేసి రైతుకు ఎరువులు సరఫరా చేయాలని సూచించారు. ఈ మీటింగ్‌లో అందరూ డీలర్స్ పాల్గొన్నారు.

దీపావళి కానుకగా ఉచిత వంటగ్యాస్



నాదెండ్ల: రాష్ట్ర వ్యాప్తంగా దీపావళి కానుకగా ఉచిత వంట గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రానున్నట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. నాదెండ్ల మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, బుక్కాపురం గ్రామాల్లో పంచాయతీరాజ్ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పల్లె పండుగ నిర్వహించారు. రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణానికి భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, సర్పంచ్ కామినేని లలితా, ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, జనసేన ఇన్‌చార్జి తోట రాజారామేష్, గుర్రం రామారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణహిత దీపావళి అవగాహన ర్యాలీ



నరసరావుపేట రూరల్: ఏఎం రెడ్డి విద్యా సంస్థల ఆధ్వర్యంలో బుధ వారం పట్టణంలో సురక్షిత, పర్యావరణ హిత దీపావళి అవగాహన ర్యాలీ నిర్వహించారు. మల్లమ్మ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పల్నాడు బస్టాండ్ వరకు జరిగింది. బాణసంచా కాల్చే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు ర్యాలీలో వివరించారు. పెద్దలు, పిల్లలు ప్రమాదరహితంగా దీపావళిని జరుపుకోవాలని ఆకాంక్షించారు. పర్యావరణాన్ని కాపాడుకుందాం–దీపావళిని పర్యావరణ రహితంగా జరుపుకుందాం, కాలుష్య రహిత దీపావళి మన అందరి బాధ్యత అంటూ విద్యార్థులు ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ మల్లికార్జున రావు, డిప్లొమో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీపావళి ముందస్తు సంబరాలు




చిలకలూరిపేట: దీపావళి అంటే దీపాల పండుగ అని మానవులను అజ్ఞానపు చీకట్ల నుంచి సన్మార్గం వైపు నడిచే వెలుగులు చూపుతుందని మోడరన్ విద్యా సంస్థల డైరెక్టర్ చేబ్రోలు మహేష్ తెలిపారు. మోడరన్ స్టెల్లార్ స్కూల్‌లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు దీపాలు వెలిగించి, బాణాసంచా కాల్చి సందడి చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండుగ నిర్వహిస్తారని తెలిపారు. దీపజ్యోతిని పరబ్రహ్మ స్వరూపంగా, మనో వికాసానికి, ఆనందానికి నిదర్శనంగా భావిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు చేసిన సందడి ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ దేవులపల్లి ఫణికుమార్, స్కూల్ డైరెక్టర్ చేబ్రోలు సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీతమ్స్‌లో ఘనంగా దీపావళి వేడుకలు



వినుకొండ(నూజెండ్ల): స్థానిక నరసరావుపేట రోడ్డులోని గీతమ్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యార్థులు గీసిన రంగవల్లికలు చూపరులను ఆకర్షించాయి. ఈ సందర్భంగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి మాట్లాడుతూ నరకాసురునిపై కృష్ణుడి విజయం తర్వాత చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా దీపావళి జరుపుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

సీపీఐ డిమాండ్



నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలను వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ డిమాండ్ చేశారు. ఆరండల్ పేటలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 18వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఎ. పి. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంత నిరుపేదలకు ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పట్టణాలలో రెండు సెంట్లు గ్రామాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరారు. అలాగే ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసి ఎన్నికల వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కరెంట్ చార్జీలను పెంచడాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తుందని తెలిపారు.

■ **రేపు సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ**

బొల్లాపల్లి : సామాజిక భద్రతా పింఛన్లు నవంబరు 1న పింఛన్‌దారులకు పంపిణీ చేస్తామని మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది బుధవారం తెలిపారు. నేడు (గురువారం) సెలవుదినం కావడంతో పింఛన్‌దారుల నగదును సచివాలయ సిబ్బందికి ఒక రోజు ముందుగానే అందజేశామని తెలిపారు.